సాక్షి
అన్నమయ్య జిల్లా
బుధవారం । 19 । ఏప్రిల్ । 2023

బీటెక్ విద్యార్థి ఆత్మహత్య



కురబలకోట మండలం అంగళ్లులోని ఓ కళాశాలలో సీఎస్ఈ బీటెక్ తృతీయ సంవత్సరం చదువుతున్న మధు (21) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఐపీఎల్ ఆన్‌లైన్ బెట్టింగ్‌లు లేదా రుణ యాప్‌లు కారణమా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. - 8లో



బైక్‌ల చోరీ ముఠా సభ్యుడి అరెస్ట్

ద్విచక్రవాహనాల చోరీలకు పాల్పడుతున్న అంతర్ జిల్లా ముఠా సభ్యుడిని అరెస్ట్ చేసి 14 బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.74	రూ.92
రెండోరకం	రూ.50	రూ.72

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 217 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)



రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	530	546
సీబీ	-	-

మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 476.32 కిలోలు

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ బుధ (సా॥)	సహర్ గురు (ఉ॥)
రాజంపేట	6.33	4.39
రాయచోటి	6.34	4.37
మదనపల్లి	6.35	4.38
పీలేరు	6.32	4.32

న్యూస్‌రీల్

4న అరుణాచలంకు బస్సు

మదనపల్లె సిటీ: అరుణాచలంకు మే 4న ప్రత్యేక బస్సు సర్వీసు నడుపుతున్నట్లు ఆర్టీసీ-1 డిపో మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. రానుపోను చార్జీ ఒకరికి రూ.805 చెల్లించాలన్నారు. మూడు లేదా ఆపై టిక్కెట్లు ఉంటే వారి వద్దకే వచ్చి టిక్కెట్లు ఇస్తామన్నారు. దీంతో పాటు ప్రతి రోజు మదనపల్లె-సికింద్రాబాదుకు స్టార్‌లైనర్ నాన్ ఏసీ స్లీపర్ బస్సు నడుపుతున్నట్లు తెలిపారు. ప్రతి సోమవారం మల్లయ్యకొండకు ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతున్నట్లు పేర్కొన్నారు. ప్రయాణికులు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించి ఆర్టీసీని ఆదరించాలని కోరారు.

బకాయిలు చెల్లించండి

రాయచోటి : ఉద్యోగుల బకాయిల్ని చెల్లించి ప్రభుత్వం భరోసా కల్పించాలని ఏపీజేఏసీ అమరావతి అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు నరసింహ కుమార్, సెక్రటరీ మల్లికార్జునలు డిమాండ్ చేశారు. మంగళవారం రాయచోటి కలెక్టర్ కార్యాలయం ఎదుట సమస్యల సాధన కోసం ధర్నా నిర్వహించారు. సీపీఎస్‌ను రద్దు చేసి ఓటీఎస్‌ను అమలు చేయాలని కోరారు.

క్రియేటివిటీ రాష్ట్ర డైరెక్టర్‌గా నిర్మలాదేవి



నంబేపల్లి: ఆంధ్రప్రదేశ్ క్రియేటివిటీ రాష్ట్ర డైరెక్టర్‌గా వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి చిదంబరరెడ్డి సతీమణి ఎం.నిర్మలాదేవిని నియమించారు. ఈమేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ .జగన్‌మోహన్‌రెడ్డి నుంచి ఉత్తర్వులు వచ్చినట్టు ఆమె తెలిపారు. సీఎం తమపై ఎంతో నమ్మకంతో ఈ పదవిని అప్పగించడం అదృష్టమన్నారు. ముఖ్యమంత్రి పేరు నిలబెట్టేలా బాధ్యతలను నిర్వహిస్తానన్నారు. ఈ పదవి వచ్చేందుకు సహకరించిన ఎంపీ పి.వి మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డిలకు ధన్యవాదాలు తెలిపారు. అలాగే మాజీ డీసీఎంఎస్ చైర్మన్ ఆవుల విష్ణువర్ధన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

బాలామృతం సరఫరాకు టెండర్ల ఆహ్వానం

రాయచోటిటౌన్: ఐసీడీఎస్ కార్యాలయం నుంచి అంగన్ వాడీ కేంద్రాలకు బాలామృతం సరఫరా చేసేందుకు టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ సాధికారిత అధికారి శశికళ ఒక ప్రకటనలో తెలిపారు. 1వ తేదీ నుంచి 23 వతేదీ వరకు ఈ టెండర్లు స్వీకరిస్తామన్నారు. 24 నుంచి 26 వరకు టెండర్ల పరిశీలన ఉంటుందన్నారు. 27వ తేదీ కలెక్టర్ కార్యాలయంలో టెండర్లు తెరుస్తారని పేర్కొన్నారు. వివరాలకు 8074390654 లేదా7893791910 నంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు.

పసుపు రైతులకు సువర్ణావకాశం



మాట్లాడుతున్న పంజం సుకుమార్‌రెడ్డి

రైల్వేకోడూరు అర్బన్ : రైతు భరోసా కేంద్రాలలో నమోదు చేసుకున్న పసుపు రైతులకు రాష్ట్ర ప్రభుత్వం పసుపు క్వింటాకు రూ.6850 ఇస్తుందని జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి తెలిపారు. ఈ సువర్ణావకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ పసుపు రైతులకు గతంలో పసుపు క్వింటాకు మద్దతు ధర రూ.5200 ఉంటే ప్రస్తుతం రూ.6850 చేశారని తెలిపారు. అలాగే అరటి, బొప్పాయి, మామిడి పంటల్లో తెగుళ్ల నివారణకు శాస్త్రవేత్తల బృందం అధ్యయనం చేస్తోందన్నారు. జెడ్పీటీసీ రత్నమ్మ పాల్గొన్నారు.

రిమ్స్‌లో ఎన్ఎంసీ అధికారుల పర్యటన

కడప అర్బన్: కడప నగర శివార్లలోని ప్రభుత్వ సర్వజన వైద్య కళాశాల (రిమ్స్)లో బయోకెమిస్ట్రీ విభాగానికి ఐదు పీజీ సీట్ల ప్రతిపాదనలకు సంబంధించి నేషనల్ మెడికల్ కౌన్సిల్ (ఎన్ఎంసీ) అధికారుల బృందం సభ్యులు మంగళవారం పర్యటించారు. ఆ విభాగంలో పరిశీలన చేశారు. ఎన్ఎంసీ సభ్యుడు కర్ణాటక రాష్ట్రం గుల్బర్గా ఈఎస్ఐసీ మెడికల్ కళాశాల బయోకెమిస్ట్రీ హెచ్ఓడీ డాక్టర్ సతీష్‌కుమార్, సిబ్బంది బృందంలో ఉన్నారు. రిమ్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ. సురేఖ పాల్గొన్నారు.

టీడీపీలో ఆధిపత్య పోరు.!

- మొన్న లింగారెడ్డిపై పుత్తా నోటిదురుసు
- నేడు వరదపై లింగారెడ్డి మండిపాటు
- ఆహ్వానం లేకపోయినా ఎందుకొచ్చావ్ అంటూ తీవ్రస్వరం
- స్టేజీపై నుంచి దింపాలంటూ హుకుం
- ప్రాంతీయ సదస్సు సాక్షిగా విభేదాలు బట్టబయలు



మాజీ ఎమ్మెల్యే వరదపై మండిపడుతున్న మల్లెల లింగారెడ్డి

సాక్షి ప్రతినిధి, కడప: 'ఆలు లేదు, చూలు లేదు, కొడుకు పేరు సోమలింగం' అన్న సామెత చందంగా తయారైంది జిల్లాలో తెలుగుదేశం పార్టీ పరిస్థితి. ఎన్నికలు రానేలేదు, అప్పుడే అధికారంలోకి వచ్చినట్లుగా తెలుగు తమ్ముళ్లు భ్రమిస్తున్నారు. ఒకరిపై మరొకరు ఆధిపత్యం ప్రదర్శిస్తున్నారు. తెలుగుదేశం పార్టీలో పైచేయి మాదంటే మాదే అన్పించుకునే చర్యలకు తెగబడ్డారు. మంగళవారం కడపలో జరిగిన జోన్-5 ప్రాంతీయ సదస్సు అందుకు వేదికగా నిలిచింది. ప్రజానీకం విస్తుపోయేలా గండికోట ప్రాజెక్టు తానే కట్టానని అధినేత చంద్రబాబు అబద్ధాలు వల్లిస్తే, మరోవైపు ఆధిపత్యం కోసం తెలుగు తమ్ముళ్లు తగవులాడుకోవడం గమనార్హం. జోన్-5 ప్రాంతీయ సదస్సు నిర్వహణ ఏర్పాట్లు, పార్టీ వ్యవహారాల్లో పైచేయి సాధించాలనే ఆతృత జిల్లా నేతల్లో ఉండింది. అందుకు అనుగుణంగా తొలుత సమావేశాన్ని ఎయిర్‌పోర్టు సమీపంలో నిర్వహించాలని భావించారు. అయితే అక్కడొద్దు మా స్థలంలోనే ఏర్పాటు చేయాలని కమలాపురం ఇన్‌చార్జి పుత్తా నరసింహారెడ్డి పట్టుబట్టారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా వేదికను ఎంపిక చేయాలనే ఉద్దేశంతో ఆ పార్టీ కడప పార్లమెంటరీ జిల్లా అధ్యక్షుడు మల్లెల లింగారెడ్డి రెండు ప్రాంతాలను అధికారులతో కలిసి పరిశీలించేందుకు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో లింగారెడ్డిపై పుత్తా నరసింహారెడ్డి నోరు పారేసుకున్నట్లు పరిశీలకులు వెల్లడిస్తున్నారు. ఓ వైపు అధికారులు, మరోవైపు జిల్లా అధ్యక్షుడి సూచనలను పట్టించుకోకుండా తాను చెప్పిందే జరగాలనే దిశగా పట్టుబట్టి పుత్తా పైచేయి సాధించారు. మంగళవారం జరిగిన ప్రాంతీయ సదస్సు సందర్భంగా లింగారెడ్డి ప్రవర్తించిన తీరు సైతం ఆ పార్టీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

మాజీ ఎమ్మెల్యే వరదపై మండిపాటు...

జోన్-5 ప్రాంతీయ సదస్సుకు మాజీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య ఇరువురు చేరుకున్నారు. స్టేజీ మీదున్న ఆ ఇరువురి చెంతకు జిల్లా అధ్యక్షుడు లింగారెడ్డి వెళ్లారు. ఎన్నికల్లో పార్టీ లేదు, బొ...లేదన్నావు. పిలుపు లేకపోయినా సి..శ...లేకుండా ఎలా వచ్చావంటూ నిలదీశారు. మరింత పరుష పదజాలం ప్రయోగించి, అసలు స్టేజీ మీదకు రానిచ్చినవారెవ్వరంటూ నానా హంగామా చేశారని పరిశీలకులు పేర్కొంటున్నారు. భవిష్యత్తులో ప్రొద్దుటూరు నియోజకవర్గంలో వరదరాజులరెడ్డి పార్టీ టికెట్ పోటీదారుడు అవుతారనే భయంతోనే ఆ స్థాయిలో మండిపడినట్లు తెలుగు తమ్ముళ్లు గుసగుసలాడుతున్నారు.

▶▶ హవ్వా.. నవ్విపోదురుగాక..

'నావల్లే రాయలసీమకు నీరు వస్తోంది. గండికోట ప్రాజెక్టు నేనే కట్టాను. నా హయాంలోనే హంద్రీ-నీవా, గాలేరు-నగరి ప్రాజెక్టులకు అధిక నిధులు వెచ్చించాను.' ఈ మాటలన్నది ఎవ్వరో కాదు, టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు. పచ్చి అబద్ధాన్ని సైతం నిజమని నమ్మించడంలో చంద్రబాబు దిట్ట అనే విషయాన్ని మరోసారి ఆయన నిరూపించుకున్నారు. వాస్తవాలను పరిశీలిస్తే గండికోట ప్రాజెక్టును 1999-2004లో చంద్రబాబు హయాంలో అప్రాధాన్య ప్రాజెక్టుల జాబితాలోకి చేర్చారు. రాష్ట్ర బడ్జెట్‌లో అతి స్వల్ప నిధులు కేటాయించారు. అలాంటి పరిస్థితిలో చంద్రబాబు హయాంలో గండికోట ప్రాజెక్టు మరుగున పడింది. 2004లో డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత గాలేరు-నగరి సుజల స్రవంతి, హంద్రీ-నీవా సుజల స్రవంతి పథకాలను పరుగులెత్తించారు. అందులో భాగంగా గండికోట ప్రాజెక్టును డాక్టర్ వైఎస్ఆర్ పూర్తి చేశారు. ఇది జగమెరిగిన సత్యం. కాగా తానే గండికోట ప్రాజెక్టును పూర్తి చేశానని చంద్రబాబు చెప్పుకోవడం విడ్డూరంగా ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. అధికారంలో ఉన్నన్నాళ్లు కడప స్టీల్ ప్లాంట్ గురించి చంద్రబాబు పట్టించుకున్న పాపాన పోలేదు. ఎన్నికల సమయంలో హడావుడిగా మైలవరం సమీపంలో స్టీల్ ప్లాంట్‌కు పునాది వేశారు. వాస్తవాలు ఇలా ఉంటే తాను మాత్రమే, తాను కొనసాగి ఉంటే అన్న మాటలు బాబు మినహా మరెవ్వరూ చెప్పుకోలేరని పలువురు పెదవి విరుస్తున్నారు.

చంద్రబాబు గోబ్యాక్

- కడపలో టీడీపీ అధినేత చంద్రబాబు పర్యటన పట్ల నిరసన
- లోకేష్‌తో క్షమాపణ చెప్పించాకే జిల్లాలో అడుగుపెట్టాలని డిమాండ్

కడప కార్పొరేషన్: విదేశీ విద్య వల్ల దళితులు పీకిందేమీ లేదని వ్యాఖ్యానించిన లోకేష్‌తో క్షమాపణ చెప్పించాకే చంద్రబాబు జిల్లాలో అడుగు పెట్టాలని ఏపీ సోషల్ వెల్ఫేర్ బోర్డు చైర్మన్ పులి సునీల్ కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం వైఎస్సార్ జిల్లా కడపలో చంద్రబాబు పర్యటనను నిరసిస్తూ వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు సీహెచ్ వినోద్ కుమార్ ఆధ్వర్యంలో స్థానిక వినాయక నగర్ సర్కిల్ సమీపంలో నల్ల రిబ్బన్లు, నల్ల జెండాలు, నల్ల బెలూన్లతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దళితులను కించపరిచేలా మాట్లాడిన లోకేష్ బహిరంగ క్షమాపణ చెప్పాలన్నారు. గతంలో చంద్రబాబు కూడా దళితులుగా పుట్టాలని ఎవరైనా కోరుకుంటారా అని తమను అవమానించేలా మాట్లాడారని గుర్తు చేశారు. ఇప్పుడు ఆయన తనయుడు కూడా అలాంటి వ్యాఖ్యలే చేయడం దారుణమన్నారు. దళితులకు క్షమాపణ చెప్పిన తర్వాతే జిల్లాలో అడుగు పెట్టాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా అక్కడి నుంచి వెళ్లిపోవాలని పోలీసులు సూచించగా వారు అంగీకరించలేదు. బలవంతంగా తరలించేందుకు ప్రయత్నించగా పోలీసులు, నిరసనకారుల మధ్య వాగ్వాదం, తోపులాట జరిగింది. ఎట్టకేలకు పోలీసులు వారిని బలవంతంగా అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ఎస్సీసెల్ మాజీ అధ్యక్షుడు జి. గరుడాద్రి, త్యాగరాజు, నగర అధ్యక్షుడు చైతన్య, కార్పొరేటర్లు ఆర్. చెన్నయ్య, కె బాబు, కో ఆప్షన్ సభ్యురాలు బండి మరియలు, పార్టీ నాయకులు ఎస్. సుబ్బారెడ్డి, పి. సంపత్ కుమార్, బండి బాబు, చైతల్య, దత్తసాయి, లక్ష్మీనారాయణ, సీహెచ్ సునీల్, సుశీలమ్మ, జ్యోతి, తులశమ్మ తదితరులు పాల్గొన్నారు.



నల్లజెండాలు, నల్ల బెలూన్లతో నిరసన వ్యక్తం చేస్తున్న వైఎస్సార్‌సీపీ దళిత నాయకులు

బుక్ మై వేతో తిరుమల ప్యాకేజీ అనుసంధానం



హార్సిలీహిల్స్ గవర్నర్ బంగ్లా పరిశీలిస్తున్న గిరిధర్‌రెడ్డి

బి.కొత్తకోట: పర్యాటకశాఖ ద్వారా అమలు చేస్తున్న శ్రీవారి దర్శన ప్యాకేజీని బుక్ మై వే సంస్థతో అనుసంధానం చేస్తున్నట్లు ఆ శాఖ తిరుపతి, కడప డివిజనల్ మేనేజర్ మడితాటి గిరిధర్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన బి.కొత్తకోట మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌పై తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ శ్రీవారి దర్శన ప్యాకేజీల అమలు మరింత పారదర్శకంగా, భక్తులకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. వచ్చే ఆరునెలల్లో ఇది అమలులోకి వస్తుందని చెప్పారు. పర్యాటకశాఖకు ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్లు 2,500 కేటాయించాలని టీటీడీని కోరినట్టు తెలిపారు. తిరుమలలో ఒక రెస్టారెంట్ నడుస్తుండగా కొత్త కొండపై ఒకటి, శ్రీనివాసంలో ఒకటి ప్రారంభించేందుకు టీటీడీ అనుమతి కోరామన్నారు. హార్సిలీహిల్స్ ఆదాయం నెలకు రూ.33 లక్షలు ఉంటోందని చెప్పారు. ఇక్కడ గదుల ఆధునికీకరణ, అభివృద్ధి కోసం రూ.5 కోట్లతో ప్రతిపాదనలు తయారు చేశామన్నారు. ప్రతి సోమ, మంగళవారాల్లో తిరుపతి నుంచి శ్రీశైలం, అహోబిలం, మహానంది క్షేత్రాలకు తిరుపతి నుంచి ప్యాకేజీలు అమలుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. పీలేరు, రాయచోటిలో హైవేరోడ్డు పక్కన రెస్టారెంట్లు ప్రారంభించేందుకు చర్యలు చేపట్టామని, పీలేరులో 1.78 ఎకరాలు, రాయచోటిలో అర ఎకరం స్థలం గుర్తించామన్నారు. తిరుపతి డివిజన్‌లో 2022-23లో పర్యాటక ఆదాయం రూ.74.23 కోట్లు వచ్చిందన్నారు. ఇందులో పర్యాటక ప్రాంతాల నుంచి రు.16.98 కోట్లు రాగా, రవాణా విభాగం నుంచి రూ.57.24 కోట్లు వచ్చిందన్నారు. కడప డివిజన్‌లో 2022-23లో రూ.4.87 కోట్ల ఆదాయం లభించగా అందులో కడప బార్, రెస్టారెంట్, గదుల ద్వారా రూ.2.34 కోట్లు, గండి నుంచి రూ.24.37 లక్షలు, గండికోట నుంచి రూ.1.23 కోట్లు, ఇడుపులపాయ నుంచి రూ.30లక్షలు, ఒంటిమిట్ట నుంచి రూ.54.24 లక్షల ఆదాయం వచ్చిందన్నారు.

▶▶ హార్సిలీహిల్స్‌పై నేడు టౌన్‌షిప్ కమిటీ సమావేశం

పర్యాటక కేంద్రం హార్సిలీహి హిల్స్‌పై బుధవారం ఉదయం హార్సిలీహిల్స్ టౌన్‌షిప్ కమిటీ సమావేశమవుతోంది. కమిటీ చైర్మన్, మదనపల్లె ఆర్డీఓ ఎంఎస్. మురళీ అధ్యక్షతన జరిగే ఈ సమావేశాన్ని టూరిజం కాన్ఫరెన్స్ హాలులో ఏర్పాటు చేయనున్నారు. పర్యాటకశాఖ తిరుపతి డివిజనల్ మేనేజర్ మడితాటి గిరిధర్‌రెడ్డి, డిస్కం ఈఈ రాజశేఖర్‌రెడ్డి, వివిధ శాఖలకు చెందిన అధికారులు హాజరవుతారు.

స్కౌట్స్ ప్రాంతీయ శిక్షణా కేంద్రం అభివృద్ధికి వినతి

రాయచోటి : స్కౌట్స్ అండ్ గైడ్స్ కార్యకలాపాలకు కేంద్రంగా ఉన్న హార్సిలీహిల్స్‌లోని ప్రాంతీయ శిక్షణ కేంద్రం(రీజినల్ ట్రైనింగ్ సెంటర్) అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్‌కు విజ్ఞప్తి చేశారు. మంగళవారం స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో స్కౌట్ అధికారులు అన్నమయ్య జిల్లా కలెక్టర్‌ను కలిసి విన్నవించారు. 60 ఏళ్ల నుంచి పొరుగు రాష్ట్రాలైన కర్ణాటక, తమిళనాడులతో పాటు రాయలసీమ జిల్లాలలోని స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులకు పర్వతారోహణ, ట్రెక్కింగ్ వంటి అంశాలలో శిక్షణ ఇచ్చేందుకు ఈ ప్రాంతీయ శిక్షణ కేంద్రం ఎంతో ఉపయోగకరంగా ఉందన్నారు. శిక్షణా కేంద్రంలో ప్రస్తుతం ఉన్న భవనాలు కూలిపోయే దశలో ఉన్నాయని వాటి స్థానంలో నూతన భవనాల నిర్మాణం, సుందరీకరణకు అవసరమైన చర్యలకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా సెక్రటరీ నరసింహారెడ్డి, సీనియర్ గైడ్ కెప్టెన్ శకుంతల, జిల్లా అసిస్టెంట్ స్టేట్ ఆర్గనైజింగ్ కమిషనర్ లక్ష్మీకర, స్కౌట్ మాస్టర్లు ఓబుల్‌రెడ్డి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న జిల్లా స్కౌట్ అధికారుల బృందం

జన సురక్ష పథకాలపై విస్తృత ప్రచారం చేయాలి



జనసురక్ష కార్యక్రమం అమలు తీరుపై సమీక్షిస్తున్న జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్

రాయచోటి : జిల్లాలో జన సురక్ష పథకాలపై గ్రామ స్థాయిలో విస్తృత ప్రచారం చేయాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం రాయచోటి కలెక్టరేట్‌లో జిల్లాలో గ్రామ స్థాయి జనసురక్ష కార్యక్రమం అమలులో భాగంగా ఎల్డీఎం ఆధ్వర్యంలో కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి కన్సల్టేటివ్ కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ భారత ప్రభుత్వ ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆదేశానుసారం జిల్లాలో గ్రామస్థాయి జన సురక్ష కార్యక్రమాన్ని పటిష్టవంతంగా అమలు చేయాలన్నారు. ఇందులో భాగంగా పీఎంజేజేబీవై, పీఎంఎస్‌బీవై పథకం ప్రయోజనాలపై ఏప్రిల్ 1 నుంచి జూన్ 30 వరకు మూడు నెలల పాటు జిల్లాలో విస్తృత ప్రచారం నిర్వహించేందుకు తగిన కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకోవాలని అధికారులకు, బ్యాంకర్లకు సూచించారు. ఈ సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ, డీపీఓ ధనలక్ష్మీ, ఎల్‌డీఎం వెంకటేశ్వరరెడ్డి, వివిధ బ్యాంకుల కంట్రోలర్లు తదితరులు పాల్గొన్నారు.

▶▶ త్వరితగతిన భూ పరిహారం పంపిణీ చేయాలి

మదనపల్లె-పీలేరు జాతీయ రహదారి-71కు సంబంధించి త్వరితగతిన భూపరిహారం పంపిణీ చేయాలని కలెక్టర్ గిరీషా పీఎస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి కలెక్టరేట్ మినీ వీడియో కాన్ఫరెన్సు హాల్‌లో మదనపల్లె నుంచి పీలేరు వరకు చేపట్టిన జాతీయ రహదారి-71 భూ పరిహారం అంశంపై ఆర్డీఓలు, జాతీయ రహదారి అధికారులు సంబంధిత తహసీల్దార్లతో కలెక్టర్ సమీక్షించారు. మదనపల్లె-పీలేరు వరకు చేపట్టిన జాతీయ రహదారికి అవసరమైన భూసేకరణ చేశామన్నారు. వచ్చే వారంలోగా భూపరిహార పంపిణీ పూర్తి చేసి భూమిని ఎన్‌హెచ్ అధికారులకు అప్పజెప్పాలని ఆదేశించారు. ములకలచెరువు నుంచి మదనపల్లె వరకు జాతీయ రహదారి (ఎన్‌హెచ్-42) పెండింగ్ భూసేకరణ, పరిహార భూ పంపిణీ కూడా వేగవంతం చేయాలన్నారు. ఈ సమీక్షలో రాయచోటి, మదనపల్లె ఆర్డీఓలు రంగస్వామి, మురళి, సంబంధిత తహసీల్దార్లు, జాతీయ రహదారుల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కలసి ఉంటే కలదు సుఖం..!

- విచ్ఛిన్నమవుతున్న వివాహ బంధాలు
- అపార్థాలే అనర్థాలకు మూలం
- కాపురాలను నిలబెడుతున్న ఫ్యామిలీ కౌన్సెలింగ్



ఫ్యామిలీ కౌన్సెలింగ్ సెంటర్‌లో కౌన్సెలింగ్ చేస్తున్న పోలీసు అధికారి (ఫైల్‌ఫోటో)

మదనపల్లె సిటీ: మాంగల్యం తంతునానేనా... మమ జీవన హేతునా.. కంఠే బద్నామి శుభగేత్వం జీవశరదం శతం..ఈ మంత్రాన్ని అందరూ వందల సార్లు విని ఉంటారు. ఈ మంత్రం వింటూనే వరుడు వధువు మెడలో తాళి కడతాడు. ఈ మాంగల్య ధారణతో మనం తోడునీడగా వందేళ్లు కలిసి ఉందాం... అని క్లుప్తంగా దీని అర్థం. వేలాది జంటలు ఈ మంత్రాన్ని అర్థం చేసుకుని బతుకులను పండించుకుంటూ ఉంటే... కొందరు మాత్రం అపార్థాలకు, అనుమానాలకు పోయి నిండు జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. సర్దుకుపోతూ కాలాన్ని మధురం చేసుకోవాల్సిన వారు అనవసర గొడవలకు పోయి కుటుంబాలకు చేదు జ్ఞాపకాలు మిగుల్చుతున్నారు. మదనపల్లె పోలీసు సబ్ డివిజన్ పరిధిలో ఈ పెడధోరణి ప్రబలుతోంది. చాలా జంటలు కోర్టు మెట్లెక్కుతున్నాయి. ఇలాంటి గొడవలను పరిష్కరించేందుకు పోలీసు శాఖ ఆధ్వర్యంలో మదనపల్లె టు టౌన్ పోలీసు స్టేషన్‌లో ఫ్యామిలీ కౌన్సెలింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. మూడు ముళ్ల బంధం చాలా మందికి పల్లేరు ముళ్ల చందంగా మారుతోంది. పెరుగుతున్న పాశ్చాత్య ధోరణి, మనుషులను అర్థం చేసుకునే తత్వం తగ్గడంతో కాపురాలు కూలిపోతున్నాయి. ఒక తరం ముందు వరకు కష్టనష్టాలను కలిసి పంచుకున్న దంపతులు, తరం మారే సరికి సర్దుకుపోయే తత్వాన్ని మర్చిపోయి మనుషులను దూరం చేసుకుంటున్నారు. చిన్న చిన్న విషయాలకు కూడా పెద్ద గొడవలకు పోయి దాంపత్యం బుగ్గిపాలు చేసుకుంటున్నారు.


మనస్పర్థలతో..

పెద్దగా ఆస్తులు, చెప్పుకోదగ్గ ఆదాయ వనరులు, సమాజంలో హోదా, సౌకర్యాలు, సౌఖ్యాలు లేని రోజుల్లో భార్యాభర్తలు హాయిగా అమరికలు లేకుండా బతికేశారు. కానీ చదువు, ఉద్యోగం, స్థాయి, హోదా అనేవి వచ్చాక ఆలోచనల్లోనూ మార్పు కనిపిస్తోంది. సరదాగా సాగాల్సిన కాపురాల్లో చిన్నచిన్న మనస్పర్థలు, అనుమానాలు కలతలు సృష్టిస్తున్నాయి. జీవితాంతం తోడూనీడగా కలిసి నడవాల్సిన ఆలుమగల మధ్య విభేదాలు వేరే కుంపటికి దారి తీస్తున్నాయి. లేనిపోని అనుమానాలతో దంపతులు పోలీసు స్టేషన్ మెట్లెక్కుతుండటంతో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నప్పటికి చాలా మంది తీరు మారడం లేదు. కానీ కొందరు మాత్రం అర్థం చేసుకుని వివాహ బంధాన్ని బలోపేతం చేసుకుంటున్నారు.

ఆశించిన ఫలితాలిస్తున్న ఫ్యామిలీ కౌన్సెలింగ్ సెంటర్

మదనపల్లె పోలీసుశాఖ సబ్‌డివిజన్ పరిధిలో గత ఏడాది అక్టోబర్ 13న ఫ్యామిలీ కౌన్సెలింగ్ సెంటర్ ఏర్పాటు చేశారు. చిన్న చిన్న సంఘటనలతో కాపురాలు కూలిపోతున్నాయి. ఇలాంటివి సున్నితంగా పరిష్కరించడానికి సెంటర్ మంచి ఫలితాలు ఇస్తోంది. ఇప్పటి వరకు సుమారు 40 కేసులు పరిష్కరించారు. ఇందులో భార్యాభర్తల మధ్య విభేదాలు, మహిళలపై దాడులు, చెప్పుకోలేని సమస్యలతో ఇబ్బందులు పడుతున్న మహిళా సమస్యలు, మహిళలపై లైంగిక వేధింపులు, మహిళలను బ్లాక్‌మెయిల్ చేసి వేధింపులకు పాల్పడే కేసులను కౌన్సెలింగ్ కేంద్రం ద్వారా పరిష్కరించుకోవచ్చు. మదనపల్లె, తంబళ్లపల్లె నియోజకవర్గాల్లోని అన్ని మండలాల నుంచి బాధితులు నేరుగా ఫిర్యాదు చేసుకోవచ్చు. లేదంటే సంబంధిత పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే వారు ఫ్యామిలీ కౌన్సెలింగ్ కేంద్రానికి పంపుతారు. భార్యాభర్తలకు అర్థమయ్యే రీతిలో కౌన్సెలింగ్ ఇచ్చి వారిని కలుపుతున్నారు.


మహిళలు సద్వినియోగం చేసుకోవాలి



ఫ్యామిలీ కౌన్సెలింగ్ కేంద్రాన్ని మహిళల సమస్యలు పరిష్కరించడానికి ఏర్పాటు చేశారు. మహిళలపై ఎలాంటి వేధింపులు జరిగినా నేరుగా కౌన్సెలింగ్ కేంద్రంలో చెప్పుకోవడం వల్ల నిపుణులు వారి సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తారు. మహిళలు సద్వినియోగం చేసుకోవాలి.

–మురళీకృష్ణ, టుటౌన్ సీఐ, మదనపల్లె

మనసు విప్పి మాట్లాడుకోవాలి



ముందుగా దంపతుల మధ్య సఖ్యత ఉండాలి. అభిప్రాయాలు నిర్మొహమాటంగా వెల్లడించుకోవాలి. ప్రశాంతంగా వ్యవహరించుకోవాలి. ఆరోపణలు, అభియోగ ధోరణి ఉండకూడదు. భాగస్వాముల్లో ఏకపక్ష నిర్ణయాలు ఆశించినంత ఫలితాలు ఇవ్వవు. కమ్యూనికేషన్ గ్యాప్ ఉండకూడదు. – జిల్లా లలితమ్మ, ఫోర్డు సంస్థ డైరెక్టర్, మదనపల్లె

వివాహిత ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : వివాహిత ఆత్మహత్యకు యత్నించిన సంఘటన మంగళవారం గుర్రంకొండ మండలంలో జరిగింది. గుర్రంకొండకు చెందిన మమత (21) కుటుంబ సమస్యల కారణంగా పురుగుల మందు తాగింది. అపస్మారకస్థితిలో పడి ఉన్న ఆమెను కుటుంబ సభ్యులు మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు.

వ్యక్తిపై దాడి: కేసు నమోదు

కలికిరి : వ్యక్తిపై దాడి ఘటనకు సంబంధించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ లోకేష్ రెడ్డి తెలిపార. పోలీసుల కథనం మేరకు.. కలికిరి పట్టణ పరిధిలోని టెలిఫోన్ ఎక్స్చేంజ్ వీధికి చెందిన ఓ మహిళ తన ఇంటి సామాన్లు మరో ఇంటికి మార్చుకోవడానికి 16న రాత్రి క్రాస్ రోడ్డుకు వెళ్లి అక్కడ ఆటో డ్రైవరు రఫీతో బాడుగ మాట్లాడింది. అక్కడే ఉన్న కాకుల మధును ఇంటి సామాన్లు తరలించడానికి సహాయంగా రావాలని కోరడంతో అతను కూడా వచ్చాడు. అయితే వారి ఇంటి పక్కనున్న టీడీపీ నాయకుడు షేక్ హనీఫ్, మహమ్మద్ యాసిన్, మహమ్మద్ షమీర్, అబు, బెంగళూరు అను వారు కాకుల మధును కులం పేరుతో దూషించి ఇక్కడికి ఎందుకు వచ్చావని దాడికి పాల్పడ్డారు. స్థానికులు, ఆటో డ్రైవరు సాయంతో అక్కడి నుంచి బయటపడ్డ మధు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

ఆస్తి కోసం అన్నను కొట్టిన తమ్ముళ్లు

ఒంటిమిట్ట: మండల పరిధిలోని మండపంపల్లె గ్రామంలో ఆస్తి కోసం తమ్ముళ్లు అన్నను చెట్టుకు కట్టేసి కొట్టిన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు, పోలీసుల కథనం మేరకు.. ఒంటిమిట్ట మండలం మండపంపల్లె గ్రామంలో విజయభాస్కర్‌రెడ్డి, రాంప్రసాద్‌రెడ్డి, ఆదినారాయణరెడ్డి అన్నదమ్ముళ్లు. వారిలో విజయభాస్కర్‌రెడ్డి పొలం కావాలని తమ్ముళ్లను అడిగాడు. తాము నిమ్మ తోట వేసుకున్నామని, పొలం ఇచ్చేది లేదని చెప్పడంతో ఆగ్రహించిన అన్న అమ్మేందుకు సిద్ధంగా ఉంచిన నిమ్మకాయల మూటల్లో ఒక దానిని ఎత్తుకెళ్లాడు.దీంతో ఆగ్రహించిన తమ్ముళ్లు అన్నను చెట్టుకు కట్టేసి కొట్టారు.n దీనిపై రెండు వర్గాల నుంచి ఫిర్యాదు అందడంతో విచారణ చేపడుతున్నామని ఎస్ఐ మధుసూదన్‌రావు తెలిపారు.

బైక్‌ల చోరీ ముఠా సభ్యుడి అరెస్ట్


స్వాధీనం చేసుకున్న బైక్‌లు, నిందితుడితో డీఎస్పీ కేశప్ప, టూటౌన్ సీఐ మురళీకృష్ణ

మదనపల్లె : ద్విచక్రవాహనాల చోరీలకు పాల్పడుతున్న అంతర్‌జిల్లా ముఠా సభ్యుడిని అరెస్ట్ చేసి, అతని వద్ద నుంచి రూ.10 లక్షలు విలువ చేసే 14 బైక్‌లు స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ కేశప్ప వెల్లడించారు. మంగళవారం టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో విలేకరులకు వివరాలను వెల్లడించారు. ఇటీవల మదనపల్లె పట్టణ, మండలంలో ద్విచక్రవాహనాల చోరీ కేసులు అధికంగా నమోదు కావడంతో టూటౌన్ సీఐ మురళీకృష్ణ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందంతో దర్యాప్తు ముమ్మరం చేశామన్నారు. మంగళవారం ఉదయం మదనపల్లె పట్టణంలోని అన్నమయ్య సర్కిల్ వద్ద పోలీసులు వాహనాలు తనిఖీ చేపట్టారు. ఈసమయంలో గుర్రంకొండ మండలం సంగసముద్రం పంచాయతీ కొత్తపల్లెకు చెందిన కమాల్‌బాషా కుమారుడు పఠాన్ నూర్‌మహ్మద్(28) అనుమానాస్పదంగా సంచరిస్తూ కనిపించాడు. అతన్ని అదుపులోకి తీసుకుని విచారించగా, మదనపల్లె పట్టణం దేవళంవీధికి చెందిన షేక్ అదీద్‌హుస్సేన్‌అలీ కుమారుడైన షేక్ సైషాఅలీతో కలిసి బైక్‌ల చోరీలకు పాల్పడుతున్నట్లు అంగీకరించాడు. అతను తెలిపిన వివరాల మేరకు గుర్రంకొండ మండలం సంగసముద్రం పంచాయతీ కొత్తపల్లె అటవీప్రాంతంలో నిందితులు దాచి ఉంచిన 14 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితుల్లో ఒకడైన నూర్ మహ్మద్ ఎలక్ట్రీషియన్ గా , డ్రైవర్‌గా పని చేస్తూ ద్విచక్రవాహనాలు చోరీ చేసి సైషాఅలీకి అప్పగించేవాడన్నారు. వాటిని విక్రయించిన తర్వాత వచ్చిన నగదు ఇరువురు పంచుకునేవారు. కేసులో ప్రధాన నిందితుడైన షేక్ సైషాఅలీ పరారీలో ఉండగా, అతని కోసం ముమ్మరంగా గాలిస్తున్నట్లు తెలిపారు. నిందితున్ని త్వరలోనే పట్టుకుంటామన్నారు. స్ప్లెండర్ - 05, ప్యాషన్‌ప్రో - 08, హోండా షైన్ - 01, మొత్తం రూ.10 లక్షలు విలువైన 14 ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. మదనపల్లె టూటౌన్‌లో 10, తాలూకా పోలీస్‌స్టేషన్‌లో రెండు ద్విచక్రవాహన చోరీలపై కేసులు నమోదయ్యాయన్నారు.బైక్‌ల చోరో కేసు దర్యాప్తులో ప్రతిభ చూపిన టూటౌన్ సీఐ మురళీకృష్ణ, ఎస్ఐ జి.చంద్రమోహన్, హెచ్‌సీ శంకర, పోలీసు సిబ్బంది మునిరత్నం, రెడ్డిప్రసాద్, భద్రనాయక్, రెడ్డిశేఖర్‌లను డీఎస్పీ అభినందించారు.

బీటెక్ విద్యార్థి ఆత్మహత్య


మధు (ఫైల్)

కురబలకోట: కురబలకోట మండలం అంగళ్లులోని ఓ కళాశాలలో సీఎస్ఈ బీటెక్ తృతీయ సంవత్సరం చదువుతున్న మధు (21) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ముదివేడు పోలీసుల కథనం మేరకు.. పీటీఎం మండలం అంగడివారిపల్లెకు చెందిన కుడుం ఉత్తన్న కుమారుడు మధు చదువుల్లో మేటి. పదిలో ఫస్ట్‌క్లాస్‌లో పాసయ్యాడు. ఇంటర్‌లో కూడా రాణించాడు. అంగళ్లులోని ఓ కళాశాలలో ఇతనికి సీఎస్ఈలో ఫ్రీ సీటు వచ్చింది. తృతీయ సంవత్సరం చదువుతున్నాడు. సహ విద్యార్థులతో బాగా కలసిపోయే వాడు. అంగళ్లులో రూము అద్దెకు తీసుకుని కళాశాలకు రాకపోకలు సాగించేవాడు. ఈనేపథ్యంలో ఈనెల 12న సాయంత్రం నుంచి కనిపించకుండా పోయాడు. రూముకు రాకపోవడంతో స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు కూడా చుట్టుపక్కల విచారించారు. సెల్ ఫోన్ కూడా రూములో వదిలి వెళ్లాడు. ఇతని ఆచూకీ కోసం కుటుంబీకులు పలుచోట్ల గాలించారు. ఎక్కడైనా ఉంటాడులే అని భావి స్తూ వచ్చారు. మంగళవారం ఉదయం అంగళ్లులోని తుమ్మచెట్లపల్లె వద్ద ఉన్న కోల్డ్‌స్టోరేజీ వెనుక వైపు ప్రాంతంలో దుర్వాసన రాసాగింది. స్థానికులు పరిశీలించి చూడగా కుళ్లిన స్థితిలో శవం కన్పించింది. మృతుడి దుస్తులు, చెప్పుల ఆధారంగా అదృశ్యమైన మధుగా గుర్తించారు. పక్కన టమాటా పంట వద్ద ఉన్న డ్రిప్ వైరుతో ఇతను చెట్టుకు ఉరి వేసుకున్నట్లు సంఘటన స్థలాన్ని బట్టి స్పష్టమవుతోంది. ముట్టుకుంటే ఊడిపోయే పరిస్థితి కావడంతో డాక్టర్లు మంగళవారం సంఘటన స్థలానికి వచ్చి పోస్టుమార్టం నిర్వహించారు. మృతదేహాన్ని కుటుంబీకులకు అప్పగించారు.

ఎందుకురా ఇలా చేశావ్..

ఇదిలా ఉండగా మధుకు తెలివైన విద్యార్థిగా పేరుంది. ఎవ్వరితో ఎలాంటి విబేధాలు లేవు. ఆర్థిక సమస్యతో స్నేహితులను ఇటీవల డబ్బు అడిగినట్లు చెబుతున్నారు. దీనికి తోడు అంగళ్లుకు చెందిన మరొకరికి బాకీ ఉన్నట్లు సమాచారం. కొత్త అప్పు పుట్టక మరో వైపు చేసిన అప్పు తీరే మార్గం కన్పించక మనో వేదనకు గురై ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. స్నేహితులు మాత్రం ఎందుకురా ఇంత పని చేశావని సంఘటన స్థలంలో కంట తడిపెట్టడం చూపరులను కలిచివేసింది. తమ్ముడూ.. ఏం తక్కువ చేశామురా నీకు.. మన కుటుంబంలో ఒక్కరూ చదువుకున్న వారు లేరు.. నువ్వన్నా ప్రయోజకుడవు అవుతావని ఎన్నో ఆశలు పెట్టుకున్నాం. మాకున్నా లేకున్నా.. కష్టపడి చదివిస్తున్నాం కదరా.. ఎందుకిలా చేశావురా.. అంటూ మధు అన్నయ్య బోరున విలపించాడు. ఈ సంఘటనపై సమగ్ర విచారణ జరుపుతున్నట్లు రూరల్ సర్కిల్ సీఐ శివాంజనేయులు తెలిపారు. ఐపీఎల్ ఆన్‌లైన్ బెట్టింగ్‌లు లేదా రుణ యాప్‌లు ఏమైనా ఈ సంఘటనకు దారి తీశాయా అన్న కోణంలో కూడా విచారణ జరుపుతున్నట్లు తెలిపారు.

ఘర్షణలో ఇద్దరికి తీవ్ర గాయాలు

మదనపల్లె : దారి సమస్యపై జరిగిన గొడవలో కొంతమంది కలిసి ఇద్దరిపై దాడి చేసి తీవ్రంగా గాయపరచిన సంఘటన గుర్రంకొండ మండలంలో మంగళవారం జరిగింది. మండలంలోని నడిమికండ్రిగ పంచాయతీ గెరికుంటపల్లెకు చెందిన దేవరయ్య (45) ఇంటికి, అదే గ్రామానికి చెందిన గుర్రయ్య ఇంటి ముందు ఉన్న దారి వెంట వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. అయితే తమ ఇంటి ముందు రావద్దని గుర్రయ్య గొడవ పెట్టుకున్నాడు. దేవరయ్యపై గుర్రయ్య, అతని కుటుంబ సభ్యులు దాడి చేశారు. ఆ సమయంలో అటువైపు వచ్చిన అదే గ్రామానికి చెందిన మోహన్ భార్య చిట్టెమ్మ (34)పై అక్కడే ఉన్న గుర్రయ్య బంధువు భద్రయ్య దాడి చేసి గాయపరిచాడు. దాడిలో దేవరయ్య, చిట్టెమ్మలు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని కుటుంబ సభ్యులు మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఔట్ పోస్టు సిబ్బంది గుర్రంకొండ పోలీసులకు సమాచారం అందించారు.

మహిళ అదృశ్యం: కేసు నమోదు


రెడ్డెమ్మ

పెద్దతిప్పసముద్రం : మండలంలోని తుమ్మరకుంట పంచాయతీ దిగవ బండమీదపల్లికి చెందిన నెలవంకి నరసింహులు భార్య రెడ్డెమ్మ (35) ఈ నెల 7న అదృశ్యమైనట్లు భర్త పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బి.కొత్తకోటకు వెళుతున్నానని ఇంట్లో వాళ్లకు చెప్పిందని, అప్పటి నుంచి తిరిగి ఇంటికి రాలేదన్నారు. బంధువులు, స్నేహితుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లేకపోవడంతో పోలీసులను ఆశ్రయించాడు. కర్నాటక రాష్ట్రం దొడ్డబళ్ళాపురం తాలూకా చెన్నాపురం గ్రామానికి చెందిన వెంకటేష్ అనే వ్యక్తిపై అనుమానం వ్యక్తం చేస్తూ ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు.

టీడీపీలో కుమ్ములాట

పోలీసులకు ఫిర్యాదు – కేసు నమోదు

కలికిరి : పీలేరు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి సొంత మండలం కలికిరిలో సోమవారం రాత్రి జరిగిన ఇఫ్తార్ విందులో బాహా బాహికి దిగారు. ఈ ఘటనపై ఒక వర్గం వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. కలికిరి పట్టణం కలకడ రోడ్డులోని ఏహెచ్‌సీ కల్యాణ మండపంలో సోమవారం రాత్రి టీడీపీ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి హాజరయ్యారు. కార్యక్రమంలో పట్టణానికి చెందిన సనావుల్లాతో పాటు అతని వెంట టీడీపీలోనే మరో వర్గానికి చెందిన హనీఫ్ అనుచరులు ఉండటంపై హనీఫ్, అతని తమ్ముళ్లు జాకీర్, యాసీన్, చమన్ షా తదితరులు సనావుల్లాపై దాడికి దిగారు. అనంతరం సనావుల్లా అక్కడి నుంచి వెళుతుండగా మరోసారి అడ్డగించి దాడి చేశారు. తమ అనుచరులను వెంట తిప్పుకుంటే చంపేస్తామని బెదిరించారు. గమనించిన స్థానికులు బాధితున్ని వారి నుంచి విడిపించారు. ఈ మేరకు మంగళవారం రాత్రి బాధితుడు సనావుల్లా పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ లోకేష్ రెడ్డి తెలిపారు.

4,500 లీటర్ల సారా ఊట ధ్వంసం


సారా ఊటను ధ్వంసం చేస్తున్న పోలీసులు

మదనపల్లె : మండలంలోని నారమాకులతండాలో మంగళవారం ఉదయం ఎస్ఈబీ, పోలీస్ అధికారులు కార్డెన్‌సెర్చ్ నిర్వహించారు. జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు ఆదేశాల మేరకు డీఎస్పీ కేశప్ప ఆధ్వర్యంలో చేపట్టిన తనిఖీల్లో పోలీసు, ఎస్ఈబీ సిబ్బంది గ్రామాన్ని జల్లెడ పట్టారు. విస్తృతంగా దాడులు చేపట్టి సారా తయారీ బట్టీలను గుర్తించి సుమారు 4,500 లీటర్ల సారా ఊటను ధ్వంసం చేశారు. పోలీసుల రాకను గమనించిన సారా తయారీదారులు సుమారు 500కిలోల నల్లబెల్లంకు నిప్పు పెట్టారు.దీంతో 50కిలోల బెల్లంను, సారా తయారీకి ఉపయోగించే తుమ్మచెక్కను స్వాధీనం చేసుకున్నారు. గ్రామంలో విస్తృతంగా జరిపిన తనిఖీల్లో రికార్డులు లేని రెండు మోటార్‌సైకిళ్లు, ఒక ఆటోను సీజ్‌చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో డీఎస్పీ కేశప్ప మాట్లాడుతూ... సారా తయారీ నేరమని, వండినా, అమ్మినా క్రిమినల్ కేసులు నమోదుచేసి జైలుకు పంపుతామని పదేపదే చెబుతున్నా తిరిగి నేరాలకు పాల్పడం బాధాకరమన్నారు.సారా తయారీకి ముడిసరుకులు, బెల్లం, తుమ్మచెక్క, పండ్ల తొక్కలు ఎక్కడి నుంచి తెచ్చుకుంటున్నారో గుర్తించి, సరఫరాదారులపై కేసులు నమోదుచేస్తామన్నారు. సారా విక్రేతలపై సస్పెక్ట్ షీట్‌లు ఓపెన్‌చేసి నిఘా పెడతామన్నారు. ఎక్కువ కేసులు నమోదైన వ్యక్తులపై పీడీ చట్టం కింద కేసులు నమోదుచేయడంతో పాటు జిల్లా బహిష్కరణకు ఉన్నతాధికారులకు సిఫారసు చేస్తామన్నారు. ఎస్ఈబీ ఎఈఎస్ రాధాకృష్ణ, తాలూకా సీఐ సత్యనారాయణ, పోలీస్, ఎస్ఈబీ సిబ్బంది పాల్గొన్నారు.

బిడ్డ ఆచూకీ తెలపండి


పోలీస్ స్టేషన్ వద్ద బైఠాయించిన చంద్రావతి

వాల్మీకిపురం : తమ బిడ్డ ఆచూకీ తెలయజేయాలని పోలీస్ స్టేషన్ ఎదుట ఓ తల్లి బైఠాయించి నిరసన వ్యక్తం చేసిన ఘటన వాల్మీకిపురం పోలీస్ స్టేషన్‌లో మంగళవారం చోటు చేసుకొంది. వివరాలు.. పట్టణంలోని ఇందిరమ్మ కాలనీకి చెందిన చంద్రావతి అంగన్‌వాడీ కార్యకర్తగా పని చేస్తోంది. ఈమెకు సౌమ్య శరత్ (19) కుమార్తె ఉంది. సౌమ్య తిరుపతి వికాస్ నర్సింగ్ కాలేజీలో బీఎస్సీ నర్సింగ్ చదువుతోంది.కష్టపడి బిడ్డను చదివిస్తోంది. గత వారం కాలేజీ నుంచి సౌమ్య ఇంటికి వచ్చింది. ఈ నేపథ్యంలో ఈ నెల 11వ తేదిన చంద్రావతి మళ్లీ కుమార్తెను దగ్గరుండి కాలేజీకి బస్సు ఎక్కి సాగనంపింది. వాల్మీకిపురం నుంచి తిరుపతి ప్రయాణ సమయం 2:30గంటలు పడుతుంది. ఈ నేపథ్యంలో కుమార్తె కాలేజీకీ చేరుకుందా లేదా అని వాకబ్ చేయడంతో రాలేదని అక్కడి సిబ్బంది తెలపడంతో హుటాహుటిన స్థానిక పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసింది. వారం రోజులు బిడ్డ కోసం నిరీక్షించిన చంద్రావతి మంగళవారం పోలీస్ స్టేషన్‌కు వెళ్లి స్టేషన్ ముందు బైఠాయించింది. తన బిడ్డ ఆచూకి తెలిసే వరకు ఇక్కడ నుంచి కదిలేదని లేదని భీష్మించుకుంది. న్యాయం చేస్తామని, అమ్మాయి కాల్‌డేటాను సేకరిస్తున్నామని పోలీసులు చెప్పినా చంద్రావతి వినలేదు. తనకు ఇక్కడి పోలీసులు న్యాయం చేయకపోతే జిల్లా ఎస్పీని ఆశ్రయిస్తానని పేర్కొంది.కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బస్సు ఢీకొని వ్యక్తి మృతి


ఆదినారాయణ (ఫైల్)

వాల్మీకిపురం : మదనపల్లె నుంచి తిరుపతి వైపు వెళ్తున్న కర్ణాటక వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మంగళవారం రాత్రి పట్టణంలోని రైల్వే స్టేషన్ సమీపంలో చోటు చేసుకొంది. వివరాలు..

వాల్మీకిపురం పంచాయతీ ఫత్తేపురానికి చెందిన తుమ్మల ఆదినారాయణ (50) మదనపల్లిలోని ఓ ప్రైవేటు లాడ్జీలో పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం సాయంత్రం మదనపల్లె నుంచి వచ్చి రైల్వేస్టేషన్ వద్ద బస్సు దిగి నడిచి వెళ్తుండగా అదే సమయంలో మదనపల్లె నుండి తిరుపతికి వెళ్తున్న కర్ణాటక బస్సు ఢీకొని అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు ఏఎస్సై లీలావతి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు బిడ్డలు ఉన్నారు.

బైక్‌ల ఢీ : రైతుకు తీవ్రగాయాలు

నిమ్మనపల్లె : రోడ్డు ప్రమాదంలో రైతు తీవ్రంగా గాయపడిన సంఘటన మంగళవారం నిమ్మనపల్లె మండలంలో జరిగింది. ముస్టూరుకు చెందిన రైతు ఆనందబాబు (49) ద్విచక్రవాహనంలో పొలం వద్దకు వెళుతుండగా ముస్టూరు క్రాస్ వద్ద వెనుక నుంచి వచ్చిన మరో బైక్ ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆనందబాబు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు అతన్ని మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చెట్టుపై నుంచి పడి..

ములకలచెరువు : మేకలకు మేత కోసం చెట్టెక్కిన ఒక వ్యక్తి అదుపుతప్పి కిందపడడంతో తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన మంగళవారం మండలంలో చోటుచేసుకుంది. 108 సిబ్బంది కథనం మేరకు.. మండలంలోని బురకాయలకోటకు చెందిన నాగరాజు (39) మేకల మేత కోసం సమీపంలోని రావిచెట్టు ఎక్కాడు. ఒక కొమ్మలో నుంచి మరో కొమ్మలోకి వెళ్లే క్రమంలో కాలుజారీ కిందపడ్డాడు. ఈ ప్రమాదంలో కాలు, తలకు గాయాలయ్యాయి. స్థానికులు గమనించి 108 సహాయంతో మదనపల్లి జిల్లా ప్రభుత్వ హాస్పిటల్‌కు తరలించి చికిత్స చేయిస్తున్నారు.

ఆటో, ద్విచక్రవాహనం ఢీ కొని..

చిన్నమండెం : మండల పరిధిలోని కడప–బెంగళూరు జాతీయ రహదారిపై హిందూస్థాన్ పెట్రోల్‌బంకు వద్ద ఆటో ద్విచక్రవాహనం ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. ప్రత్యక్ష సాక్షుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. కలిబండకు చెందిన భార్యాభర్తలు ఇద్దరు పిల్లలతో కలిసి ద్విచక్రవాహనంలో రాయచోటి వైపు నుంచి చిన్నమండెం బయలు దేరారు.ఈ సమయంలో చిన్నమండెం వైపు నుంచి పెట్రోల్ బంకులోకి వెళ్తున్న ఆటోను ద్విచక్రవాహనం ఢీకొనడంతో దంపతులకు గాయాలైనట్లు తెలిపారు. క్షతగాత్రులను రాయచోటి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

కారు, ట్రాక్టర్ ఢీకొని..

రాయచోటిటౌన్ : పట్టణంలోని మదనపల్లె రోడ్డులో జరిగిన రోడ్డుప్రమాదంలో కారు డ్రైవర్ జనార్థన్ రెడ్డికి గాయాలయ్యాయి. మంగళవారం రాత్రి రా మదనపల్లె వైపు నుంచి రాయచోటికి వస్తున్న కారును రాయచోటి పట్టణం నుంచి మదనపల్లె రోడ్డు వైపు వెళ్తున్న ట్రాక్టర్ ఢీకొట్టింది. ఈసంఘటనలో కారులో ఉన్న జనార్థన్‌రెడ్డికి గాయాలయ్యాయి. గాయపడిన వ్యక్తిని రాయచోటి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ట్రాఫిక్ ఎస్ఐ మహమ్మద్ రఫీ తెలిపారు.

అగ్నిప్రమాదం: రూ.6లక్షల నష్టం


కాలిబూడిదైన పూరిగుడిసె

తంబళ్లపల్లె : మండలంలో సోమవారం జరిగిన అగ్నిప్రమాదంలో పూరిగుడిసె, వ్యవసాయ పరికరాలు కాలిపోయాయి. ఈ సంఘటన మంగళవారం వెలుగు చూసింది. బాధితుల కథనం మేరకు వివరాలు. గుండ్లపల్లెకు చెందిన వెంకట నరసమ్మ బోరు బావి వద్ద గొర్రెలకోసం పూరిగుడిసె నిర్మించుకుని రాత్రి అక్కడే ఉండేవారు. సోమవారం మధ్యాహ్నం గుర్తుతెలియని వ్యక్తులు రోడ్డు పక్కన నిప్పుపెట్టారు. మంటలు పూరిగుడిసెకు అంటుకుని కాలిపోయింది. అక్కడే ఉన్న బోరు మోటారు, కేబుల్‌వైర్లు, స్టాటర్, పైపులు, డ్రిప్పు పైపులు, 4 ట్రాక్టర్ల టమాటా కట్టెలు కాలిపోయాయి. మల్లికార్జున, శేఖర్‌కు చెందిన ట్రాక్టర్ లోడ్ కట్టెలు, మల్లికార్జున నాయుడుకు చెందిన సుమారు రెండు ట్రాక్టర్ల టామాటా కట్టెలు కాలిపోయాయి. సుమారు రు.6లక్షల వరకు ఆస్తినష్టం కలిగిందని బాధితులు వాపోయారు. తహసీల్దార్ కళావతికి వినతిపత్రం అందజేసి ఆదుకోవాలన్నారు.

మెప్మా సీఓ, ఆర్పీల మోసంపై విచారణ


మహిళా సంఘాల సభ్యులను విచారిస్తున్న మెప్మా అధికారులు

మదనపల్లె : నకిలీ స్వయంసహాయక సంఘాల పేరుతో బ్యాంకులో కోటికిపైగా రుణాలు తీసుకుని స్వాహా చేసిన ఘటనలో మెప్మా సీఓ రవి, ఇద్దరు ఆర్పీల ప్రమేయంపై అధికారులు విచారణ ప్రారంభించారు. మంగళవారం స్థానిక మెప్మా కార్యాలయంలో కడప మెప్మా ఏఓ సురేష్, బ్యాంక్ లింకేజి అధికారి గోపీనాథ్, జీవనోపాధి స్పెషలిస్ట్ నాగరాజు తదితరులు అక్రమాలపై విచారణ నిర్వహించారు. మెప్మాలో ఒక బ్యాంకు నుంచి మరో బ్యాంకుకు గ్రూపుల బదిలీ సాకుతో రూ.1.60కోట్లు పక్కదారి పట్టించి మెప్మా సీఓ, ఆర్పీలు కాజేసిన విషయం తెలిసిందే. దీనికి సంబంధించి అమ్మచెరువుమిట్ట, చంద్రాకాలనీ, అనపగుట్ట తదితర ప్రాంతాలకు చెందిన మహిళాసంఘాల సభ్యులను కార్యాలయానికి పిలిపించి గ్రూపులవారీగా జరిగిన మోసంపై విచారించారు. గ్రూపుసభ్యుల తీర్మానం, ఆధార్‌కార్డుల సవరణ, టేకోవర్ చేయకుండానే రుణాలు ఇప్పించడంలో సీఓ, ఆర్పీల పాత్ర తదితర విషయాలపై సమగ్ర దర్యాప్తు, నిర్వహించారు. ఉదయం ప్రారంభమైన విచారణ సాయంత్రం వరకు జరుగుతూనే ఉంది. అయితే విచారణకు రుణాల స్వాహాలో ప్రధాన సూత్రధారి సీఓ రవి గైర్హాజరయ్యారు. గ్రూపుసభ్యులు, ఇద్దరు ఆర్పీలు మాత్రమే విచారణకు హాజరయ్యారు. సీఓ రవి గైర్హాజరుపై మెప్మా అధికారులను వివరణ కోరితే..విచారణకు రావాల్సిందిగా సీఓ రవికి తెలిపేందుకు ప్రయత్నిస్తే ఫోన్ పనిచేయలేదని, నేరుగా విషయం తెలపాల్సిందిగా పుంగనూరులోని మెప్మా అధికారి మధుసూధన్‌కు తెలిపామన్నారు. ప్రస్తుతం సీఓ రవి పరారీలోఉన్నట్లు సమాచారం.

వర్మీ కంపోస్టు ఎరువు తయారు చేయాలి

చిన్నమండెం:ప్రతి రోజూ గ్రామ పంచాయతీ శుభ్రపరిచి చెత్తను సేకరించి సంపద తయారీ కేంద్రానికి తరలించి వర్మీ కంపోస్టు తయారు చేయాలని జిల్లా పంచాయతీ అధికారి ధనలక్ష్మీ సిబ్బందికి సూచించారు. మంగళవారం మండలంలోని కేశాపురం గ్రామంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని ఆమె తనిఖీ చేశారు. అలాగే చిన్నమండెంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ, ఈఓపీఆర్‌డీ, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం ఏర్పాటు చేసి జగనన్న స్వచ్ఛ సంకల్పం, పారిశుధ్యం, తాగునీటి సమస్యపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. 0 నుంచి ఆరేళ్ల లోపు పిల్లలకు ఆధార్ నమోదు చేయించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ రహీం, ఈఓపీఆర్‌డీ శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

21 నుంచి కడప గడపలో టీ–20 మ్యాచ్‌లు

కడప స్పోర్ట్స్ : కడప నగరంలోని వైఎస్ రాజారెడ్డి-ఏసీఏ క్రికెట్ మైదానం వేదికగా ఈనెల 21 నుంచి 26వ తేదీ వరకు సౌత్‌జోన్ ఏసీఏ సీనియర్ మెన్ టీ–20 అంతర్ జిల్లాల క్రికెట్ మ్యాచ్‌లు నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి అవ్వారు రెడ్డిప్రసాద్ తెలిపారు. కడప, అనంతపురం, నెల్లూరు, కర్నూలు, చిత్తూరు జిల్లాలకు చెందిన జట్లు ఈ పోటీల్లో తలపడనున్నట్లు తెలిపారు. అనంతరం సౌత్ జోన్ పోటీల్లో పాల్గొనే జిల్లా జట్లను ప్రకటించారు.

కడప జట్టు : ఎస్ఎండీ రఫీ (కెప్టెన్), టి. వంశీకృష్ణ (వైస్ కెప్టెన్), జి. జయవర్ధన్, డి. నరేన్‌రెడ్డి, ఎస్. ధృవకుమార్‌రెడ్డి, ఎస్. జహీర్‌అబ్బాస్, పి. జాఫర్ అలీఖాన్, జి.వి.పవన్‌కుమార్‌రెడ్డి, ఎం.హరిశంకర్ రెడ్డి, కె.యశ్వంత్, ఎస్. ఆరీఫ్‌బాషా, ఎస్. ఆసిఫ్ హుస్సేన్, ఎం.మదన్‌కుమార్, ఎ.యువరాజ్, కె.సుదర్శన్, కె.మారుతీశంకరాచారి.

స్టాండ్‌బై : ఎం. శ్రీనివాసులరెడ్డి, ఎం.చెన్నారెడ్డి, ఎం. విజయభవేంద్ర, జి.ఆంజనేయులు, ఎస్. ఆదిల్‌హుస్సేన్, పి.వెంకటేష్‌కీర్తన్, వి.ధనుష్‌రెడ్డి, కె.వెంకటసతీష్, ఎస్.అస్లాం.